# ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్
- రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 7 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వికారాబాద్ జిల్లాలోని కొత్తగాడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల(బాలికల)ను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఎలా ఉన్నారు.. ఎలా చదువుతున్నారని విద్యార్థులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న భోజనం రోజువారీ దినచర్యలు తదితర వివరాలు ఆరా తీశారు. హాస్టల్‌లో ఉండే మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి.. కొత్త మెనూ ప్రకారం భోజనం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వంట గది, డార్మెంటరీ, స్టోర్ రూమ్, బియ్యం, కూరగాయలు, వంటశాలను పరిశీలించారు. రోజూవారీ మెనూ చార్ట్‌ను పరిశీలించి భోజనం అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఆమె వెంట అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, ప్రిన్సిపాల్ సాయిలత, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్



పెద్దఅంబర్‌పేటలోని ఓ కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన యాదగిరిగుట్ట వాస్తవ్యులు ఇమ్మడి రామచంద్రారెడ్డి కుమారుడు వినీత్‌రెడ్డి, శ్రీనిధిరెడ్డి వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. **- పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 7**

## నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. వికారాబాద్ మండల పరిధిలోని శివారెడ్డిపేట, అనంతగిరిపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిరెన్సియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో గురువారం రాత్రి నిద్ర చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను అడిగి వారి సమాచారం తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మెనూ పాటిస్తున్నారా? భోజనం ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట వార్డెన్ కృష్ణకుమార్, అధికారులు ఉన్నారు.

# ఆన్‌లైన్‌లో.. కోర్టు కేసుల సమాచారం

ఆదిబట్ల, ఫిబ్రవరి 7: భూ పరిమితి చట్టానికి సంబంధించిన అన్ని కోర్టు వివాదాల వివరాలు ఆన్‌లైన్‌లోకి ఆందుబాటులోకి రానున్నాయని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఈ కోర్టు యూఎల్‌సీ ఆన్‌లైన్ పోర్టల్‌ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు వివాదాలకు సంబంధించి కోర్టు కేసుల వారీగా కక్షిదారుల సమాచారం, సర్వే నంబర్, గ్రామం, కేసు పూర్వపరాలు, ప్రస్తుత పరిస్థితి, వాయిదాల వివరాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కేసుల వివాదాల్లో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ, కింది స్థాయి అధికారులకు తక్షణ ఆదేశాలు, సూచనలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ పోర్టల్ ద్వారా మరుసటి రోజు వాయిదా ఉన్న కోర్టు కేసుల వివరాలు అందుబాటులో ఉండటంతో తక్షణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కేసుల విషయంలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యానికి తావు లేకుండా అర్బన్ ల్యాండ్ సీలింగ్ కేసుల విషయంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండేందుకు ఈ కోర్టు యూఎల్‌సీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



ఈ కోర్టు యూఎల్‌సీ ఆన్‌లైన్ పోర్టల్ ను ప్రారంబిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

## భూమి తీసుకున్నారు.. పరిహారం ఇవ్వలే..



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొడంగల్, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని అప్పాయిపల్లిలో సర్వే నం.19లో ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణం కోసం భూమిని తీసుకున్నారని, ఇప్పటివరకు పరిహారం ఇవ్వ లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల భూములను తీసుకొని, పరిహారం చెల్లించకుండా సర్వే చేస్తున్నారని రైతులు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సర్వే పనులను అడ్డుకున్నామని తెలిపారు. అసలైన రైతులకు పరిహారం ఇవ్వకుండా, రికార్డుల్లో లేని వారికి పరిహారం ఇస్తున్నారని తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా సహకరించాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, మల్లప్ప, అమృతప్ప, అశమ్మ, బసప్ప, వెంకటమ్మ, నరసింహులు తదితరులు ఉన్నారు.

## మరో రూ.500కోట్లు వసూలు చేయండి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఆస్తిపన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్‌ఎంసీ అపసోపాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2100కోట్ల టార్గెట్ విధించుకోగా.. ఇప్పటి వరకు దాదాపు రూ.1416 కోట్ల మేర మాత్రమే చేరుకున్నారు. 12 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లించగా.. మరో ఐదు లక్షల మంది ఇంకా చెల్లించాల్సి ఉంటుంది. వీరి నుంచి దాదాపు రూ.684 కోట్ల మేర ఆదాయం రావాల్సి ఉంది. వచ్చే నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఆస్తి పన్ను వసూళ్లను పెంచాలని నిర్ణయించిన అధికారులు.. ఈ మేరకు బకాయిదారులకు ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ అందిస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంను అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతి ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ ప్రభుత్వాన్ని కోరేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ప్రతిపాదన కమిషనర్ ఇలంబర్తి పరిశీలనలో ఉంది. గ్రేటర్‌లో ప్రస్తుతం ఆస్తిపన్ను బకాయిలు రూ.5వేల కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఆఫీసులకు సంబంధించిన పన్నులు రూ. 3వేల కోట్లు ఉండగా, రూ. 2 వేల కోట్లు ఆస్తిపన్ను దారుల నుంచి రావాల్సి ఉంది ఓటీఎస్‌ను ఆమలు చేస్తే ఓటీఎస్ రూపంలో రూ. 500కోట్ల మేర ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెలాఖరులోగా అధికారికంగా ఓటీఎస్ అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే 10శాతం వడ్డీతో బకాయిదారులంతా తమ ఆస్తిపన్నును చెల్లించే వెసులుబాటు దొరుకుతుంది. ఓటీఎస్‌తో దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. కాగా జీహెచ్‌ఎంసీలో ఇప్పటి వరకు మూడు సార్లు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను ఆమలు చేశారు. మొదటి సారి 2020 ఆగస్టు 1 నుంచి నవంబరు 15 వరకు, 2022 జూలైలో రెండోసారి అమలు చేశారు. మూడు సార్లు కలిపి జీహెచ్‌ఎంసీకి దాదాపు రూ. 700 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి అమలు చేస్తే రూ. 500కోట్ల వరకు ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

- అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి
- అంగన్‌వాడీ భవనాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపూర్, ఐనెల్లి, గోపనల్‌పల్లి, యాలాల మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను పరిశీలించి వాటి పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. రాంపూర్‌లోని భవనం శిథిలావస్థకు చేరుకున్నదని, రాంపూర్ కింది తండాలో ఉన్న భవనం బాగా లేకపోవడంతో అక్కడి చిన్నారు లు రాంపూర్ మీది తండాకు వస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు వివరించారు. ఐనెల్లిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం, పురాత న పాఠశాల భవనంలో కొనసాగుతున్నదని, 40 ఏండ్ల క్రితం నిర్మించిన భవనం కావడం తో విద్యార్థులకు సురక్షితమైన చోటు కాదని గ్రామస్తులు పేర్కొన్నారు. గోపన్‌పల్లిలో కొనసాగుతున్న కేంద్రం పరిస్థితి కూడా అధ్వానంగా ఉందన్నారు. వీటిపై గతంలోనే ఐసీడీఎస్ అధికారులు నివేదికలు పంపినట్లు ఆమె వెంట ఉన్న అధికారులు తెలిపారు. సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు పంపుతామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఆమె వెంట ఐసీడీఎస్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ నిర్మల, ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

# రూ.150 కోట్ల పనులపై విజిలెన్స్!

## 538 చోట్ల నిర్వహణ పనుల్లో అక్రమాలు

### విచారణకు ఆదేశించిన కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో గడిచిన కొన్నేండ్లుగా జరిగిన నిర్వహణ పనులపై విజిలెన్స్ రంగంలోకి దిగింది. 2021, 2022, 2023 సంవత్సరాల కాలంలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలంటూ ఆర్థిక శాఖకు అందుతున్న సంకేతాల నేపథ్యంలో అనుమానాలు వ్యక్తం చేసిన కమిషనర్ సమగ్ర విచారణ చేపట్టిన వాస్తవాలను నివేదిక రూపంలో అందజేయాలని విజిలెన్స్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. దాదాపు 538 చోట్ల పనుల బిల్లులలో దాదాపు రూ.150 కోట్ల మేర బిల్లులలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. 2016 నుంచి తాజా పనుల వరకు 90 శాతం పనులపై విజిలెన్స్ విభాగం విచారణ జరపనుంది. ఈ నెలాఖరులోగా విజిలెన్స్ బృందం నివేదిక ఆధారంగా కమిషనర్ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

### దిద్దుబాటు చర్యలు

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం జరుగుతున్న వరద నీటి కాలువ, నాలా, రహదారులు ఇతరత్రా నిర్వహణ పనుల్లో అక్రమాలకు తావు లేకుండా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. జీహెచ్‌ఎంసీ చట్టం 1955 సెక్షన్ 171 ప్రకారం, మునిసిపల్ నిధుల నుంచి చెల్లింపునకు సంబంధించిన చెక్కులపై కమిషనర్/స్పెషల్ ఆఫీసర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఆయన గైర్హాజరీలో సబార్డినేట్ సంతకం ఉండాలి. జీహెచ్‌ఎంసీ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా రూ.50 లక్షల వరకు పనుల జారీకి సంబంధించిన అధికారం జోనల్ కమిషనర్లకు కట్టబెడుతూ ఫిబ్రవరి 13, 2012లో నిర్ణయం తీసుకున్నారు. దీనిని 2019లో రూ.2 కోట్లకు పెంచారు. మే 1, 2024 నుంచి ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. ఆర్థిక సలహాదారు (ఎఫ్ఏ), ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆమోదంతో ఆర్థిక విభాగం నుంచి నేరుగా చెల్లింపులు జరుగుతున్నాయి. కేంద్ర కార్యాలయంలో జరిగే బిల్లుల చెల్లింపు వివరాల జాబితా కమిషనర్‌కు, జోన్లలో అక్కడి జోనల్ కమిషనర్లకు పంపి ఆమోదం తీసుకోవాలనే నిబంధన ఉంది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో ఎంత మేర చెల్లింపులు చేయాలనేది కమిషనర్ నిర్ణయిస్తారు. ఆ వివరాలు జోనల్ కమిషనర్లు పంపుతారు. ఇప్పటి వరకు జోనల్ కార్యాలయాల్లో పాటించడం లేదు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో రెండు, మూడేళ్ల క్రితం పాలనాపరమైన ఆమోదం పొందిన పనులకు సంబంధించిన బిల్లులూ ప్రస్తుతం ఆర్థిక విభాగానికి వస్తున్నాయి. జోనల్ కమిషనర్ ఆమోదం తర్వాతనే బిల్లులు మంజూరు చేస్తారు.

### కాంట్రాక్టర్లను భయ పెట్టేందుకేనా?

జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్లకు రూ.1500 కోట్ల మేర బకాయిపడింది. ఈ నేపథ్యంలో తరచూ ఆందోళనలు చేయడం, జూన్ నాటికల్లా రూ.400 కోట్ల మేర బకాయిలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా నిరసనను వాయిదా వేశారు. పాత బిల్లులపై అక్రమాలు జరిగాయన్న ఆరోపణల తరుణంలో నిర్వహణ పనులకు చెల్లించిన బిల్లులపై విజిలెన్స్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపడుతున్నారు. కాంట్రాక్టర్లను భయపెట్టే చర్యల్లో భాగంగానే విచారణ చేస్తున్నట్లు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

## పోలీసుల అదుపులో కీచక ఉపాధ్యాయుడు

ధారూరు, ఫిబ్రవరి 7 : కీచక ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఎస్పీ నారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి సీసీఎస్ పోలీసులకు బాధ్యతలు అప్పగించారు. కేసును అప్పగించిన 24 గంటల్లోనే వారు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులకు అధిక మొత్తంలో ముడుపులు అందడంతోనే నిందితుడిని పట్టుకోవడం లేదని స్థానికుల నుంచి ఆరోపణలు వచ్చాయి. మండల పరిధిలోని ధారూరు స్టేషన్ ప్రాథమికోన్నత పాఠశాలలో పెద్ద గొల్ల కిష్టయ్య తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్ 13న ఈ ఉపాధ్యాయుడిపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చామని ఎస్సై వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.




మాట్లాడుతున్న ఎస్సై వేణుగోపాల్ రెడ్డి

# భయపెడుతున్న గన్



**పెరుగుతున్న తుపాకుల వినియోగం**

### ఉత్తరాది నుంచి అక్రమంగా రవాణా
### అదనపు ఆదాయ వనరుగా తుపాకుల అమ్మకం
### నిఘా కండ్లు కప్పి తప్పించుకుంటున్న అక్రమార్కులు

**సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ):**

- 2024సెప్టెంబర్‌లో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో గంజాయి ముఠాను పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై ముఠా సభ్యులు కాల్పులు జరిపారు.
- 2024 నవంబర్‌లో హైదరాబాద్ సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటేశ్వరకాలనీలో ఓ వ్యక్తి తను ప్రేమించిన అమ్మాయి తండ్రిపై ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపారు.
- 15.01.2025 ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ బీహార్ నుంచి మూడు తుపాకులు, పది బుల్లెట్లు ఖరీదు చేసుకుని నగరానికి చేరుకున్నాడు. ఇక్కడి నేరగాళ్లకు విక్రయించే క్రమంలో రాచకొండ ఎస్‌వోటీ పోలీసులకు చిక్కాడు
- 16.01.2025 కర్ణాటకలోని బీదర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సిఎంఎస్ వాహనంపై బిహార్ దొంగలు విరుచుకుపడ్డారు. అక్కడ రూ.87లక్షల దోచుకుని అఫ్జల్‌గంజ్ చేరుకుని, ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరిపారు.
- 01.022025 ప్రిజం పబ్ వద్ద మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ గచ్చిబౌలిలోని సైబరాబాద్ సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపాడు. అతడి నుంచి పోలీసులు మూడు తుపాకులు, 451 తూటాలు స్వాధీనం చేసుకున్నారు.



**నెలరోజుల్లోనే** హైదరాబాద్‌లో జరిగిన ఘటనలే మూడు ఉన్నాయంటే అక్రమ ఆయుధాల వినియోగం తీవ్రత ఎంతగా ఉందో తెలుస్తోంది. గ్రేటర్‌లో అక్రమ ఆయుధాలు సమకూర్చుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కారణాలేవైనా తుపాకులు పేలేవరకు పోలీసులకూ తెలియడం లేదు. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల నుంచి నగరానికి వస్తున్న ఆయుధాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి. ఇటీవల నగరంలో జరిగిన సంఘటనలు చూస్తే ఈ పరిస్థితి అర్థమవుతుంది. ఆయుధాలతో పాటు ఆ దందాలు చేసే వారిపైనా పూర్తి స్థాయిలో నిఘా ఉండకపోవడం మూలాన ఎక్కడపడితే అక్కడ నాటు తుపాకులు లభిస్తున్నాయి. దీంతో నేరగాళ్లు వీటిని వినియోగిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గచ్చిబౌలిలో కాల్పులు జరిపిన బత్తుల ప్రభాకర్‌కు పెద్ద నేర చరిత్ర ఉంది. అయితే అతడు ఆయుధం వినియోగించడం ఇదే మొదటిసారి.

### అక్రమ ఆయుధాలకు కేరాఫ్..!

ఒకప్పుడు ఢిల్లీ, ముంబైలకు ఉత్తరాది నుంచి ఆయుధాలు సరఫరా అయ్యేవి. కానీ ఇప్పుడు హైదరాబాద్‌కు ఆయుధాల అక్రమ రవాణా పెరిగిందని ఒక పోలీస్ అధికారి చెప్పారు. సహజంగా బెదిరింపులు, దోపిడీలు, కిడ్నాపులు, హత్యలు.. ఇవన్నీ చేయాలంటే గన్స్ ఉండాలని నేరస్తులు భావిస్తున్నారు. వెంటవెంటనే సమస్య పరిష్కరించుకోవాలంటే పిస్టల్స్, రివాల్వర్స్ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రౌడీషీటర్లు, నేరస్తుల చేతుల్లోనే 80శాతం వరకు ఆయుధాలు ఉన్నాయని అంచనా. వీటిని రాజస్థాన్, మధ్య ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం పాతబస్తీలో నేరస్తులు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో అత్యాధునిక పిస్టళ్లు, తుపాకులు, రివాల్వర్లున్నాయి. హైదరాబాద్ నగరంలో పోలీసుల అనుమతితో పదివేల వరకు ఆయుధాలుంటే.. అనధికారికంగా సుమారు 35వేల వరకు ఉన్నట్లు పోలీసులు అంచనావేస్తున్నారు. హైదరాబాద్ నగరానికి పలు రాష్ట్రాల నుంచి తుపాకులు సరఫరా చేయడానికి ప్రత్యేక ముఠాలు పనిచేస్తున్నాయి. అక్రమ ఆయుధాలను రాజస్తాన్‌లోని జయపుర, బిహార్‌లోని గయ, ముంగేర్, పాట్నా, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, బర్వానీలలో తయారు చేస్తున్నారు. అక్కడి కరుడుగట్టిన ముఠాలు వీటిని తక్కువ ధరకు అందిస్తున్నాయి. ఆయుధాల రవాణాకు రైలుమార్గం ఒక వరంగా మారింది. జనరల్ బోగీల్లో తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో వీటిలోనే ఆయుధాలు రవాణా చేస్తున్నారు. శివారు రైల్వేస్టేషన్లలో దిగివెళ్లిపోతున్నారు. వీటికి తోడు ట్రాన్స్ పోర్ట్ లారీలు, కొన్నిసార్లు ప్రైవేటు బస్సుల్లోనూ ఇవి నగరానికి వస్తున్నాయి.

**అక్రమ ఆయుధాల ధరలు :**

- తపంచా : రూ.5వేల నుంచి రూ.8వేల వరకు
- రివాల్వర్ : రూ.25వేల నుంచి రూ.50వేలు
- పిస్టల్ : రూ.30వేల నుంచి రూ.60వేలు
- ఆటోమేటెడ్ పిస్టల్ : రూ.80వేలకు పైగా
- ఆటోమేటెడ్ రివాల్వర్ : రూ.90వేలకు పైగా

### ఆదాయవనరుగా..!

కొంతకాలంగా నగరానికి ఉత్తరాది నుంచి నగరానికి వలసలు పెరగడంతో ఆయుధాలు తెప్పించుకోవడం సులభమవుతోంది. ఓ పక్క ముఠాలే కాకుండా అక్క డినుంచి వచ్చే దినసరి కూలీలు సైతం ఆయుధ వ్యాపారాన్ని అదనపు ఆదాయ వనరుగా భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సమయంలో తమతోపాటు అక్కడి ఆయుధాలను తక్కువ ధరకు కొని ఆ తరవాత వాటిని ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. పనుల కోసం నగరంలో స్థిరపడిన బిహారీ, ఇతర రాష్ట్రాల వారు తాము తమ ప్రాంతం నుంచి సిటీకి రాకపోకలు సాగించే సమయంలో ఈ దందా చేస్తున్నారు. పాతబస్తీతో పాటు శివార్లలో ఉన్న అనేక ప్రాంతాల్లో వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. ఈ ఆయుధాల సరఫరాల మూలాలను కనుక్కోవడంలో పోలీసు నిఘా ఎంత పటిష్టంగా పనిచేసినా చివరకు ఎక్కడో ఒక దగ్గర కాల్పుల మోతలు, ఆయుధాల స్వాధీనం వంటి ఘటనలు తరచూగా జరుగుతూనే ఉన్నాయి.

# అరుదైన వ్యాధిగ్రస్తులకు అండగా నిమ్స్

### 20 పడకలతో డే కేర్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): అరుదైన జెనటికల్ డిజార్డర్ వ్యాధిగ్రస్తులకు అండగా నిలుస్తోంది నిమ్స్ వైద్యశాల. ఈ వ్యాధులు చాలా అరుదుగా, నూటికో, కోటికో ఒకరికి వస్తుంటాయని చెబుతున్నారు వైద్యులు. అయితే దురదృష్టావశాత్తు ఈ అరుదైన వ్యాధుల్లో అతి తక్కువ వ్యాధులకు మాత్రమే చికిత్స అందుబాటులో ఉందని, మిగిలిన వాటికి చికిత్స లేదని నిమ్స్ జనటికల్ విభాగం అధిపతి డాక్టర్ షాగున్ అగర్వాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 12సెంటర్లు ఉండగా, అందులో ఒకటి నగరంలోని నిమ్స్ ఒకటని, ఈ చికిత్సా కేంద్రాల్లో మాత్రమే జెనటికల్ డిజార్డర్ రోగులకు చికిత్స అందిస్తామని వివరించారు.

### 8వేల రుగ్మతల్లో..

అరుదైన జెనటికల్ డిజార్డర్స్‌లో ఇప్పటి వరకు వెయ్యి నుంచి 8వేల వ్యాధులను గుర్తించారని, అందులో ఇప్పటి వరకు కేవలం 60 వ్యాధులకు మాత్రమే చికిత్స అందుబాటులో ఉన్నట్లు డా.షాగున్ అగర్వాల్ వివరించారు. వీటికి సంబంధించిన రోగులకు నగరంలోని నిమ్స్ జెనటికల్ డిజార్డర్ విభాగంలో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అయితే ఈ సెంటర్‌కు కేవలం తెలంగాణ నుంచే కాకుండా దక్షిణ భారత దేశంలోని మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, కేరళ ప్రాంతాల నుంచి కూడా రోగులు వస్తుంటారని తెలిపారు.

### ప్రతి రోగికి రూ.50లక్షలు

చికిత్సలో భాగంగా జెనటికల్ డిజార్డర్ ఉన్న ఒక్కో రోగికి రూ.50లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయిస్తుందని, ఈ డబ్బుతో రోగికి పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తామని డాక్టర్ షాగున్ తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లోని జెనటిక్ డిజార్డర్ విభాగంలో 121మంది రోగులు రిజిస్టరై ఉన్నట్లు వెల్లడించారు. వీరికి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

### 20 పడకలతో డే కేర్ సెంటర్

సాధారణంగా ఈ అరుదైన జెనటికల్ డిజార్డర్ రోగుల్లో కొన్ని రకాల రుగ్మతలతో బాధపడే రోగులకు మాత్రం చికిత్సలో భాగంగా ఇచ్చే మందును ఐవీ ద్వారా మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం వారిని దవాఖానలో అడ్మిట్ చేయాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గత సెప్టెంబర్‌లో డే కేర్ సెంటర్‌ను ప్రారంభించినట్లు డా. షాగున్ తెలిపారు. ప్రస్తుతం 25మంది రోగులకు ఈ డేకేర్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో ప్రధానంగా రెండు రకాల అరుదైన జెనటికల్ డిజార్డర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అందులో 1.కాషర్ డీసీజ్, 2.పాంపె డిసీజ్‌లకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.